జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన సాధించడమెలా? 12

# ప్రత్యేకతలే కొండ గుర్తులు

**వివిధ సంఘటనలకు కేంద్రంగా అంతర్జాతీయ, జాతీయ వార్తల్లోకి ఎక్కే దేశాలనూ, ప్రాంతాలనూ గుర్తుపెట్టుకోవాలంటే...? వాటి నిర్దిష్ట లక్షణాలనూ, ప్రత్యేకతలనూ స్మరించుకోవటమే తేలికైన మార్గం. పోటీపరీక్షల అభ్యర్థుల ప్రయోజనార్థం ప్రచురిస్తూ వచ్చిన ఈ ధారావాహికలో ముగింపు వ్యాసమిది!**



విజయ శేఖర్

రష్యాకి కింద, కాస్పియన్ సముద్రం-చైనాల మధ్య ఉన్న ప్రాంతం మధ్యఆసియా. మాజీ సోవియట్ రష్యా నుంచి విడివడి స్థాన్‌ల పేరుతో ఏర్పడిన కజకిస్థాన్, కిర్గిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్, తుర్కుమెనిస్థాన్‌ల సమూహమే మధ్య ఆసియా. అజర్ బైజాన్, జార్జియా, ఆర్మీనియా, మంగోలియా, ఆఫ్ఘనిస్థాన్‌లను కూడా ఇందులో కలిపేవారున్నారు. అమెరికా, రష్యాలు ఇప్పటికీ ఈ ముస్లిం రాజ్యాలపై ప్రభావం కోసం పోటీపడుతున్నాయి.

నాలుగు మూల మానవజాతుల్లో ఒకటైన కాకేసియన్/ కాకసాయిడ్ (ప్రాచీన కావ్ కాస్ జాతి పేరు నుంచి పుట్టిన పదం) జాతి మూలం ఇక్కడే. ఇతర మూల జాతులు: మంగోలాయిడ్, నీగ్రాయిడ్, ఆస్ట్రలాయిడ్ (వీరు ఇంకా అండమాన్‌లో ఉన్నారు). దేశదిమ్మరి ప్రజా సమూహాలకు మధ్య ఆసియా నిలయం. ప్రఖ్యాత సిల్క్ రోడ్డుకు సమీపంలో ఉండే ఈ ప్రాంతం నిరంతర జన ప్రవాహంతో ఐరోపా, ఆసియాలకు అనుసంధానకర్తగా పనిచేసింది.

## చమురు సంపద

పర్షియా అఖాతం (పర్షియన్ గల్ఫ్) చమురు సంపదకు నిలయం. అఖాతం చుట్టూ ఉన్న దేశాల్లో ఒక ఇరాన్ తప్ప తతిమా దేశాలన్నీ అమెరికా ప్రభావంలోనివే. ఇరాన్‌కి తోడు సిరియా. అందుకని ముందు సిరియాని కబళిస్తే ఇరాన్‌ని లొంగదీసుకోవడం సులువని అమెరికా, ఐరోపాలు భావిస్తున్నాయి. ఆ ఉద్దేశంతోనే సిరియాలో కిరాయి తిరుగుబాటుని అవి రెచ్చగొట్టాయి. గల్ఫ్ దేశాలు ముఖ్యంగా కతార్, సౌదీ అరేబియాలు పశ్చిమదేశాల సామ్రాజ్యవాద కాంక్షకు చురుకుగా మద్దతు ఇస్తూ సిరియాలోని అల్-ఖైదా టెరరిస్టులకు ఆయుధాలు, డబ్బు అందిస్తున్నాయి. వీటికి సి.ఐ.ఎ. ఆయుధాలు సమకూర్చిపెడుతోందని న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రికలు సైతం చెబుతున్నాయి.

భారత ఉపఖండం మల్లే ఆఫ్రికాలో కూడా ఉత్తర, దక్షిణ భాగాల మధ్య ప్రజల రూపురేఖల్లో తేడా కనిపిస్తుంది. ఉత్తర ఆఫ్రికా ప్రజలు కాకసాయిడ్ తరగతికీ, దక్షిణ భాగం ప్రజలు నీగ్రాయిడ్ తరగతికీ చెందినవారు కావడం దీనికి కారణం.

## పోరాటాలూ లొంగుబాట్లూ

ఆఫ్రికా దేశాలను గుర్తుపెట్టుకోవడానికి పశ్చిమ దేశాల ఆధిపత్యంపై ఆ దేశాలు జరిపిన పోరాటాలు/ లొంగుబాటులే కొండగుర్తులు.

✦ అమెరికాను మొన్నటివరకూ గడాఫీ నేతృత్వంలో ఎదిరించిన లిబియా ✦ అమెరికాకు సాగిలపడిన ఈజిప్టు ✦ అరబ్ స్ప్రింగ్‌లో మొలకెత్తి వాడిపోయిన ట్యునీషియా ✦ క్రైస్తవ మెజారిటీ- దక్షిణ సూడాన్, ముస్లిం మెజారిటీ- సూడాన్‌లుగా విడిపోయిన సూడాన్ ✦ 1990ల ప్రారంభం వరకూ జాత్యహంకార ప్రభుత్వం నడిచిన దక్షిణాఫ్రికా ✦ బ్రిటిష్ తెల్లవారసుల నుంచి రాబర్ట్ ముగాబే నేతృత్వంలో భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న జింబాబ్వే ✦ సి.ఐ.ఎ. కుట్రలో పావులుగా మారిన హుటు, టుట్సీ తెగలు పరస్పర జాతిహననం సాగించుకున్న రువాండా, బురుండిలు ✦ స్వాతంత్ర్యోద్యమ నాయకుడు పాట్రిస్ లుముంబాను ప్రజాస్వామిక ఎన్నికల్లో గెలిపించుకుని కూడా కొద్దిరోజుల్లోనే అమెరికా, బ్రిటన్‌ల హత్యా రాజకీయాల్లో ఆ నేతను కోల్పోయిన కాంగో ✦ రాయల్ డచ్ కంపెనీ చమురు దాహానికీ, పర్యావరణ విధ్వంసానికీ బలైన ఒగొని ప్రజల తరపున పోరాడిన రచయిత, కవి 'కెన్ సారో వివా' ను కన్న నైజీరియా (దళారీ పాలకులు ఆయన్ను హడావుడిగా ఉరి తీశారు). ✦ ఇటీవలే అమెరికా దన్నుతో ఫ్రాన్సు పరోక్ష దురాక్రమణలోకి వెళ్లిన మాలి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లు ... ఇలా గుర్తుపెట్టుకోవచ్చు.

### ఆఫ్రికా కొమ్ము




సోమాలియా, ఇథియోపియా, ఎరిట్రియా, జిబౌటి దేశాలను కలిపి ఆఫ్రికా కొమ్ము (హార్న్ ఆఫ్ ఆఫ్రికా)గా పిలుస్తారు. అరేబియా సముద్రంలోకి కొమ్ము రూపంలో చొచ్చుకువచ్చినందున ఆ పేరు. ఈ ఆఫ్రికా కొమ్ములోనే (ముఖ్యంగా ఇథియోపియాలో) ఆధునిక మానవుడి పూర్వీకుడు హోమో సెపియన్ ఉద్భవించాడని దాదాపు ఆంత్రపాలజిస్టులు అందరూ ఏకీభవిస్తున్నారు. అంటే ప్రపంచ మానవుడి మూలం ఆఫ్రికా కొమ్ములో ఉందన్నమాట! మూల మానవులలోని ఒక శాఖ అక్కడినుంచి నైలు నది వెంట ఈజిప్టు చేరుకుని సినాయ్ ద్వీపకల్పం దాటి ఇటు మధ్య ఆసియా మీదుగా ఆసియాకూ, అటు మధ్యప్రాచ్యం మీదుగా ఐరోపాకూ చేరుకున్నారని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరొక శాఖ అరేబియా కోస్తాతీరం వెంబడి భారత్ చేరుకుందని భావిస్తున్నారు.

## ఆసియా టైగర్లు

ఆగ్నేయాసియా దేశాలు ఒకప్పుడు ఆసియా టైగర్లుగా పశ్చిమ దేశాల మన్ననలు అందుకున్నాయి. 1995 ప్రాంతంలో ఆ దేశాల నుంచి పశ్చిమ కంపెనీలు ఒక్కసారిగా పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో అవి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి.

✦ నగర రాజ్యం (సిటీస్టేట్)గా పేరుపొందిన సింగపూర్
✦ సెక్స్ టూరిజానికి కేంద్రంగా భాసిల్లుతున్న థాయిలాండ్
✦ 1950ల్లో అమెరికా చేసిన దాడిలో లక్షల మంది జనం చనిపోయిన దక్షిణ కొరియా ✦ కమ్యూనిస్టు చైనా (ఇప్పుడు కాదు) నుంచి పారిపోయి వచ్చిన ధనికుల రాజ్యం తైవాన్ ✦ 1970ల్లో అమెరికా దురాక్రమణ సైన్యానికి ముచ్చెమటలు పట్టించి తరిమికొట్టిన వియత్నాం ✦ 1975-79 మధ్య ఖ్మేర్‌రోజ్ నేతృత్వంలో శ్రామికప్రజల స్వర్గంగా నిలిచిన కాంబోడియా (కంపూచియా) ✦ ద్వీప రాజ్యాలు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్‌లు ✦ ప్రపంచ సంపన్నుల్లో ఒకరైన సుల్తాన్ పాలనలో ఉన్న బ్రూనె ... ఇవన్నీ ఒకప్పుడు ఆసియా టైగర్లు.

అమెరికా-చైనాల జియో-పొలిటికల్ వ్యూహాల మధ్య నలుగుతున్న ఉత్తర కొరియా ఈ దేశాల మధ్య చెడబుట్టిందనే విమర్శను ఎదుర్కొంటోంది.

## పశ్చిమంలో లేవు; కానీ...

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు వాటికవే ప్రత్యేకంగా ప్రపంచపటంలో ఆగ్నేయ మూలలో బాగా కింద కనిపిస్తాయి. ఇవి బ్రిటిష్ రాచరికాన్ని ఇప్పటికీ ఆమోదిస్తున్నందున రిపబ్లిక్ రాజ్యాలు కావు. ప్రపంచపటంలో పశ్చిమ దిక్కులో లేకపోయినా పశ్చిమ రాజ్యాలుగా గుర్తింపు పొందడం ఈ దేశాల ప్రత్యేకత.

ఆస్ట్రలాయిడ్ ప్రజల మూలం ఆస్ట్రేలియా. ఆస్ట్రేలియా అనగానే మనకి గుర్తుకొచ్చేదీ, కనిపించేదీ ఐరోపా నుంచి వలస వచ్చిన తెల్లవారే. కానీ ఆస్ట్రేలియా మూలవాసులు నల్లవారు. వీరు భారత్‌కు కూడా వలస వచ్చారు. మూలవాసుల నుంచి విస్తారమైన భూభాగాలను లాక్కున్న తెల్లవారు వారిని అత్యంత పేదరికంలోకి నెట్టారు. ఆస్ట్రేలియాలో జాత్యహంకారం చాలా ఎక్కువని ఐక్యరాజ్యసమితి నివేదికలే చెబుతున్నాయి. మన భారతీయులకు అది బాగా అనుభవైకవేద్యమే!


*రచయిత జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సైట్ http://teluguvartalu.com నిర్వాహకులు.*